క్లుప్తంగా

ప్రారంభమైన ఖరీఫ్ సాగు



నందిగామ: వర్షాలు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే వేసవి దుక్కులు దున్నుకుని పంట పొలాలను సిద్ధంగా ఉంచిన రైతులు ప్రస్తుతం విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. నందిగామ ప్రాంతంలో గత రెండు రోజులుగా పంట పొలాలలో రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమై కనిపిస్తున్నారు. కొందరు రైతులు పొలాల్లోని చెత్తను శుభ్రం చేస్తూ ఉండగా మరికొందరు రైతులు విత్తనాలు నాటుతున్నారు. ఈ నేపథ్యంలో పొలాలన్నీ రైతులు, వ్యవసాయ కూలీలతో నిండుగా దర్శనమిస్తున్నాయి.

షేడ్‌నెట్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



వత్సవాయి: మిర్చి షేడ్‌నెట్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖాధికారి టి.వర్ధినీకుమారి సూచించారు. మండలంలోని మక్కపేట, చిట్టేల గ్రామాల పరిధిలో ఉన్న నర్సరీలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. నాణ్యమైన విత్తనాలను నాటడంతో పాటు ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచాలని తెలిపారు. కచ్చితంగా 45 రోజులు దాటిన మొక్కలను రైతులకు అందించాలన్నారు. నర్సరీల చుట్టూ చెత్త మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచడంతో పాటు బంతి మొక్కలను నాటుకోవాలన్నారు. నర్సరీలలో మొక్కలు కొనుగోలు చేసిన రైతుల పేర్లు, వారి వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. రైతుల నుంచి ఫిర్యాదులందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొత్త వ్యక్తుల సంచారంపై సమాచారం ఇవ్వాలి



నందిగామ: గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు సందేహం వస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని పట్టణ సీఐ హనీష్ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక పోలీస్ కవాతు నిర్వహించడంతో పాటు గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు వాహనాలకు సంబంధించిన రికార్డులు కూడా వెంట ఉంచుకోవాలన్నారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ బొల్లినేని పద్మజ, ఎస్‌ఐ పండు దొర, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారిని కుటుంబ సభ్యులకు అప్పగింత



నందిగామ: పట్టణంలో తప్పిపోయిన ఓ చిన్నారిని నందిగామ పోలీసులు గంటల వ్యవధిలోనే కుటుంబ సభ్యులకు అప్పగించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం మండలంలోని కంచల గ్రామానికి చెందిన నాలుగు సంవత్సరాల చిన్నారి తన మేనత్త రజినితో కలిసి మంగళవారం నందిగామ పట్టణానికి వచ్చింది. పట్టణంలోని రైతుపేట ప్రాంతంలో చిన్నారి తప్పిపోయింది. ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సంతోష్ కుమార్ ఏడుస్తున్న ఆ చిన్నారిని గమనించి నందిగామ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు చిన్నారి తల్లిదండ్రుల వివరాలు సేకరించేందుకు సోషల్ మీడియా ద్వారా సమాచారమిచ్చారు. మొత్తానికి గంటల వ్యవధిలోనే తల్లిదండ్రుల వివరాలు తెలియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. చిన్నారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

నందిగామ: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఇటీవల బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులను మంగళవారం సాయంత్రం పాఠశాలలో సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, పలువురు ఉపాధ్యాయులు ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా బదిలీ అయ్యారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో సత్కరించారు.

డూప్లికేటు వల.. బాధితులు గిలగిల

- బరితెగిస్తున్న నేరగాళ్లు
- అత్యాశకు పోతే మొత్తం దోచేస్తున్న వైనం
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా మోసపోతున్న యువకులు
- పెండ్యాల గ్రామంలో డూప్లికేట్ యాప్ మోసానికి 400 మంది బలి
- నకిలీ యాప్‌లో రూ.3 కోట్ల పెట్టుబడి

అత్యాశకు పోతే..అసలుకే ఎసరు వస్తుందనేది సామెత. ప్రభుత్వాలు, పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలను ఎంతగా అప్రమత్తం చేస్తూనే ఉన్నా...ఇంకా ఎందరో అత్యాశతో వాటికి ఆకర్షితులై మోసపోతూనే ఉన్నారు. లక్షలాది రూపాయలు నష్టపోయి కుటుంబాలను అధోగతి పాల్జేస్తున్నారు. ఈజీమనీపై పేరాశతో మోసగాళ్లకు బలయిపోతున్నారు. సైబర్ వలలో చిక్కి విలవిలలాడుతున్నారు. తాజాగా కంచికచర్ల ప్రాంతంలో భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. ఒక్క పెండ్యాల గ్రామంలోనే 400 మంది రూ.3 కోట్ల దాకా మోసపోయారని తెలుస్తోంది.

కంచికచర్ల: కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన షేక్ చాన్‌పాషా ఏడాది క్రితం చత్తీస్‌గఢ్‌లో ఉద్యోగం కోసం వెళ్లాడు. జాబ్ చేస్తూ అక్కడ ఓ యువకుడు పరిచయం అయ్యాడు. అతను ఫోన్‌లో ఓ యాప్‌ను క్రియేట్ చేశాడు. ఆ ఆన్‌లైన్ యాప్‌లో నగదు పెట్టుబడి పెడితే ఎనభై రోజుల్లో రెట్టింపు నగదు వస్తుందని నమ్మబలికాడు. అంతేకాకుండా ఈ యాప్‌లో కొత్త వ్యక్తులను చేర్పిస్తే ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మిషన్‌లు, రిఫ్రిజిరేటర్లు, ఐ ఫోన్‌లు, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు బహుమతులుగా వస్తాయని చెప్పాడు. దీంతో చాన్‌పాషా స్వగ్రామానికి చేరుకుని ముందుగా తన అన్న అయిన షేక్ బడే అనే వ్యక్తికి యాప్‌ను డౌన్‌లోడ్ చేశాడు. ఆ తర్వాత రూ.50వేల నగదు యాప్‌లో పెట్టుబడి పెట్టగా మొదటిగా మూడు రెట్లు నగదు వచ్చింది. దీంతో తన స్నేహితులకు యాప్ గురించి తెలియజేసి వారికి యాప్‌ను డౌన్‌లోడ్ చేశాడు. 80 రోజుల పాటు యాప్‌లో పెట్టుబడి పెడుతుంటే ప్రతిరోజు ఎక్కువ మొత్తంగా నగదు వస్తాయని నమ్మబలికారు. దీంతో ఆశపడిన గ్రామంలోని యువకులు పోటీలు పడి మరీ ఆ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. అంతటితో ఆగకుండా ముస్లిం యువకులు ఎక్కువగా ఉన్న హైదరాబాద్, విజయవాడ పరిసర ప్రాంతాలకు వెళ్లి అక్కడివారిని కూడా చేర్పించి లక్షల్లో పెట్టుబడి పెట్టించారు. చివరకు పెట్టుబడి పెట్టిన వారికి మొండిచెయ్యే మిగిలింది.



ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం



పెండ్యాల గ్రామంలో డూప్లికేట్ యాప్ ద్వారా 400 మంది యువకులు సుమారు రూ.3 కోట్లపైనే నగదు పోగొట్టుకున్నారని తెలిసింది. పోలీస్ సిబ్బందిని గ్రామానికి పంపించి విచారణ చేయాలని ఆదేశించా. నగదు పోయాయని బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తాం.

– జనార్ధన నాయుడు, ఏసీపీ, నందిగామ

మొత్తం దోచేసుకున్నారు



తక్కువ రోజుల్లో ఎక్కువ నగదు వస్తుందని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మూడు దఫాలుగా రూ.2.30 లక్షలు యాప్‌లో పెట్టుబడి పెట్టాను. ఒన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ఏడు రోజుల పాటు కొంత నగదు వచ్చింది. మిగిలిన రోజులు రాలేదు. కారణం తెలుసుకుంటే యాప్‌ను నిలిపివేశారని సమాచారం వచ్చింది.

– సయ్యద్ బడే హజరత్, వెల్డింగ్ వర్కర్, పెండ్యాల

అప్పు చేసి రూ.లక్ష పెట్టా



నాది ఇనుము వ్యాపారం. యాప్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ నగదు రోజుల్లోనే వస్తాయని అంటే మొదట నమ్మలేదు. తర్వాత ఇద్దరి స్నేహితులకు అలా రావడంతో నమ్మి రూ.1లక్ష అప్పు చేసి పెట్టా. వారం గడిచినా ఒక్క పైసా రాలేదు.

– కలీమ్, పెండ్యాల

మూడింతలు వస్తాయంటే ఆశపడ్డా



రూపాయికి మూడింతలు వస్తాయని చెప్పారు. ఆశపడ్డా. బంగారం తాకట్టు పెడితే రూ.3.50 లక్షలు వచ్చాయి. పది రోజుల్లో రూ.9 లక్షలు వస్తాయని నమ్మి యాప్‌లో పెట్టుబడి పెట్టా. మొత్తం నగదు పోయాయి. ఏం చేయాలో తోచటం లేదు.

– షేక్ యూసఫ్, పెండ్యాల

ఫ్రూట్ మార్కెట్‌లో వచ్చిన డబ్బంతా పోయింది



నేను మామిడి పండ్ల వ్యాపారం చేస్తుంటాను. తక్కువ రోజుల్లో ఎక్కువ డబ్బు వస్తుందని యాప్‌లో పెట్టుబడి పెట్టా. ఒక్క పైసా కూడా రాలేదు. యాప్ ద్వారా మోసపోయా.

– షేక్ మన్సూన్, పెండ్యాల

అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలి

పెనుగంచిప్రోలు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలనేది ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. పెనుగంచిప్రోలు-1, అనిగండ్లపాడు-1 సచివాలయాల పరిధిలో మంగళవారం సర్పంచ్‌లు వేల్పుల పద్మకుమారి, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి వారు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ కారణాల వలన సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించేందుకు ప్రభుత్వం ।జగనన్న సురక్ష। కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సర్పంచ్ పద్మకుమారి మాట్లాడుతూ అర్హత ఉండి ఏదైనా కారణం చేత సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే అందించాలన్నారు. అందుకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఒకే రోజులో అక్కడికక్కడే ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏట సిద్ధారెడ్డి, గ్రామ కార్యదర్శి శ్యామ్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. అనిగండ్లపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో ఇంటింటి సర్వేలో వలంటీర్లతో తహసీల్దార్, ఎంపీడీఓ, సర్పంచ్

సంక్షేమ పథకాల అమలులో నూతన ఒరవడి

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వెల్లంకి(వీరులపాడు): సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడి సృష్టిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు సంక్షేమ పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్య శాలలు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రజలకు మంచి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ హుసేన్‌బీ, ఎంపీటీసీ వేమిరెడ్డి కోటేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.



వెల్లంకిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

దేవదాయ స్థలంలో శాశ్వత నిర్మాణాలపై ఆగ్రహం

- రామలింగేశ్వరస్వామి స్థలంలో నిర్మాణాలు పరిశీలించిన ఏసీ
- నిర్మాణాలు నిలుపుదల చేయాలని లీజుదారుడికి ఆదేశాలు

నందిగామ: పట్టణంలోని చందర్లపాడు బస్టాండ్ వద్ద రామలింగేశ్వర స్వామి వారికి చెందిన స్థలంలో నిర్మిస్తున్న కట్టడాల ప్రాంతాన్ని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి మంగళవారం పరిశీలించారు. ఇటీవల ఆలయానికి చెందిన స్థలాన్ని 11 సంవత్సరాల లీజు పద్ధతిలో బహిరంగ వేలం నిర్వహించిన సంగతి పాఠకులకు విదితమే. సదరు పాటదారుడు ఆ స్థలంలో శాశ్వత భవనాలను నిర్మిస్తున్నాడు. దీనిపై అందిన ఫిర్యాదుల నేపథ్యంలో అసిస్టెంట్ కమిషనర్ మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. తాత్కాలిక కట్టడాలకు అనుమతి తీసుకొని పర్మినెంట్ భవనాలు ఎలా నిర్మిస్తారని సదరు పాటదారుడిని అసిస్టెంట్ కమిషనర్ ప్రశ్నించడంతో పాటు నిర్మాణాలను నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తమకు ఆలయ గత ఈవో శాశ్వత భవనాలు నిర్మించుకునేందుకు అనుమతులు ఇచ్చారని పాటదారుడు అధికారులకు తెలియజేశారు. దేవదాయ శాఖ చట్టం ప్రకారం తాత్కాలిక నిర్మాణాలు మాత్రమే చేయాలని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేంతవరకు నిర్మాణాలు నిలిపివేయాలని ఆదేశించారు. ఏసీ వెంట డివిజనల్ తనిఖీదారు ఫణికుమార్, రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రస్తుత ఈవో సీతారామయ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



లీజుదారుడుతో మాట్లాడుతున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి

జగనన్న సురక్ష స్పెషల్ డ్రైవ్ పరిశీలన

నందిగామ: జగనన్న సురక్ష ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణ పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమ స్పెషల్ డ్రైవ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. పలుచోట్ల స్థానికులతో మాట్లాడి సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న సేవలను తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్దకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గర కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నందిగామలో జగనన్న సురక్ష స్పెషల్ డ్రైవ్ పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

తెలుగు జాతి గర్వించే నేత రంగా

రంగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: తెలుగు జాతి గర్వించే నేత దివంగత వంగవీటి రంగా అని, ఆయన ఆశయాల సాధనలో ముందుకు సాగుదామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణమండపంలో మంగళవారం జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో వంగవీటి రంగా అభిమానులతో ఎమ్మెల్యే ఉదయభాను ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి అహరహం కృషిచేసిన మహోన్నత వ్యక్తి వంగవీటి రంగా అన్నారు. రంగా ఒక కులానికో, ప్రాంతానికో చెందిన వ్యక్తి కాదని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలంతా ఆరాధ్య దైవంగా భావించే గొప్ప శక్తి అన్నారు. జూలై 4న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీనియర్ నాయకుడు ఆకుల శ్రీకాంత్ అధ్యక్షతన జరిగే రంగా జయంతి కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజవర్గం నుంచి రంగా అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉదయభాను ఆవిష్కరించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ఆకుల శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్(బాజీ), శ్రీకృష్ణదేవ రాయ సేవాసమితి అధ్యక్షుడు యలమంచి రాజేంద్రప్రసాద్, గోపాలకృష్ణ సొసైటీ అధ్యక్షుడు కోలపల్లి బుల్లిబాబు, పార్టీ ప్రచారకమిటీ అధ్యక్షుడు ఆవుల విజయ్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీ ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, కాపు సంఘ నాయకులు సుంకరి ఆంజనేయులు, చిట్టిప్రోలు సత్యనారాయణ, పార్టీ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు మొహిద్దీన్, కౌన్సిలర్లు కొలగాని రాము, పందుల రోశయ్య, కాశి కిషోర్, తన్నీరు నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, రంగా అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని వారిని క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతోందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతారని చెప్పారు. కుల, రేషన్, ఆదాయ, తదితర సర్టిఫికెట్‌లను అందిస్తారన్నారు. జూలై ఒకటి నుంచి అన్ని గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తారన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పారదర్శకంగా సర్వే చేయాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ సూర్యారావు, కార్యదర్శి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. గండ్రాయి గ్రామంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్, తదితరులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు.



అనుమంచిపల్లిలో జగనన్న సురక్షను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరరావు

నవ నందిగామగా తీర్చిదిద్దేందుకు కృషి

శాసనమండలి సభ్యుడు మొండితోక అరుణకుమార్

నందిగామటౌన్: నందిగామను నవ నందిగామగా తీర్చిదిద్దాలనే సమున్నత లక్ష్యంతో పనిచేస్తున్నామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలో చందర్లపాడు-రామన్నపేట రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలోని ఎన్టీఆర్ రోడ్డును విస్తరించి అభివృద్ధి చేశామన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ సమస్యకు తావు లేకుండా పట్టణంలోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా రోడ్డు విస్తరణ, అభివృద్ధికి సహకరిస్తున్న ఇన్వెంటా కెమికల్స్, క్రషర్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని నందిగామను నాలుగేళ్లలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని అభివృద్ధిని స్వాగతించాల్సిన ప్రతిపక్ష టీడీపీ అడుగడుగునా అడ్డుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

గౌరవరం(జగ్గయ్యపేట): కౌలు రైతులు సాగు హక్కుదారుల పత్రం(సీసీఆర్‌సీ) కార్డులు తీసుకోవాలని ఏవో వరలక్ష్మి అన్నారు. స్థానిక సచివాలయంలో మంగళవారం కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు కార్డులు తీసుకోవటం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పలు రకాల పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలపాడులో పేరెంట్స్ కమిటీ సమావేశం

నందిగామ: మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాఠశాల భౌగోళిక అవసరాలు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.గురుస్వామి, 192 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహకారం

వెల్లంకి(వీరులపాడు): బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన వేముల పేరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో కుటుంబ సభ్యులకు మంగళవారం ఆయన ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యునిగా ఉండి మృతి చెందిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునే పథకంలో భాగంగా మృతుని కుటుంబానికి సొసైటీ నుంచి రూ.10వేలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ తల్లపురెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మారపాక దయాకర్‌కు వైఎస్సార్ బీమా పథకం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేలను సర్పంచ్ షోడగిరి రాజశ్రీ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ జగత్, నాయకులు షోడగిరి సతీష్, నందిగాం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు

కంచికచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు జరుపుకొన్నామని పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగ విద్యార్థులందరూ ఆత్మస్థైర్యంతో బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

నందిగామ: వర్షాకాలం నేపథ్యంలో పట్టణ పరిధిలో దోమల నివారణకు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 18 వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

అమ్మఒడి తల్లిదండ్రులకు వరం

తాటిగుమ్మి(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అమ్మ ఒడి పథకం నిరుపేద తల్లిదండ్రులకు వరమని ప్రధానోపాధ్యాయుడు కామా ప్రభాకర్ అన్నారు. మండలంలోని తాటిగుమ్మి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ పథకాలపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాడు-నేడులో అవినీతి జరిగితే చర్యలు

సమగ్ర శిక్ష ఏపీసీ జి.మహేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకంలో అవినీతి జరిగితే ఉపేక్షించేది లేదని సమగ్ర శిక్ష ఏపీసీ జి.మహేశ్వరరావు అన్నారు. స్థానిక ముక్త్యాల రోడ్‌లోని సెంట్రల్ స్కూల్(ప్రాథమిక పాఠశాల)ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, జగనన్న విద్యా కానుక అమలు తీరు, వాటర్ ప్లాంట్, నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన స్టాక్ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఈడీ జిల్లా కోఆర్డినేటర్ ఎల్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సూర్యారావు, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, ఎంఈవో చిట్టిబాబు, హెచ్‌ఎం సుగుణకుమారి పాల్గొన్నారు.